క్లుప్తంగా

వాహనదారులు నిబంధనలు పాటించాలి

మానవపాడు: వాహనదారులు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని ఎస్ఐ చంద్రకాంత్ సూచించారు. ఆదివారం మండలంలోని పలె ప్రధాన కూడళ్ల వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిమితికి మించి ప్రయాణికులను తరలించకూడదని ఆటో డ్రైవర్లకు పలు వాహనదారులకు సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దత్త స్వాముల పాదయాత్ర



కేటీదొడ్డి: మండల పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన దత్త మాలధారులు పాదయాత్రగా బంద్రపల్లి దత్తాత్రేయస్వామి ఆలయానికి బయలుదేరారు. ఈ సందర్భంగా పండితులు శాస్త్రోక్తంగా స్వామి వారి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దత్తస్వాములు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం



అలంపూర్ రూరల్ : మండల పరిధిలోని లింగన్‌వాయి గ్రామంలో ఆదివారం ప్రమదవశాత్తు నాలుగు గడ్డివాములు దగ్ధమయ్యాయి. లింగన్‌వాయి గ్రామనికి చెందిన రాజు, వెంకటేష్‌కు చెందిన గడ్డివాములు దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. స్థానికుల సమాచారంతో ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. సుమారు రూ. 2 లక్షల దాక నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

శ్రీవారి సేవలో శాంతినగర్ భక్తులు



శాంతినగర్ : కలియుగ ప్రత్యక్ష దైవం ఏడుకొండల స్వామి వారి సేవకు శాంతినగర్ నుంచి భక్తులు తరలివెళ్లారు. శ్రీవారి సేవకులు గాయత్రి శ్రీనివాసులు ఆధ్వర్యంలో 20 మంది భక్తులు ఆదివారం తిరుమలకు చేరుకున్నారు. మార్గశిర పౌర్ణమి పర్వదినం సందర్భంగా విష్ణు సహస్ర నామాల పారాయణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.

'నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోంది'

గద్వాల అర్బన్: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తోందని పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇక్బాల్ పాష, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెండింగ్‌లోని డీఏలు, స్పెషల్ టీచర్ గుర్తింపు, పీఆర్సీ మంజూరు, నగదు రహిత వైద్య చికిత్సలు తదితర సమస్యలను పరిష్కరించకుండ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను నేరవేర్చాలని డిమాండ్ చేశారు.

కారు బోల్తా.. తప్పిన ప్రమాదం



ఉండవెల్లి : మండలంలోని శ్రీజోగులాంబ రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం కారు అదుపు తప్పి బోల్తాపడిన ఘటన చోటు చేసుకుంది. అలంపూర్ ఆలయానికి వెళ్తున్న భక్తుల కారు టైరు పేలడంతో ఒక్కసారిగా పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో డ్రైవర్‌తోపాటు నలుగురు మహిళలు, చిన్నారి ఉన్నారు. వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. డ్రైవర్‌కు మాత్రం స్వల్ప గాయాలయ్యాయి.

వాగుపై వంతెన నిర్మించరా ?

- 2003లో శంకుస్థాపన
- నేటికీ ప్రారంభం కాని పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



దేవబండ వాగుపై బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రదేశం

అయిజ : దశాబ్దాల క్రితం శంకుస్థాపనలు చేసిన పనులు మొదలే పెట్టడం లేదు. ఏళ్లు గడుస్తున్నాయి.. ప్రభుత్వాలు మారుతున్నాయి నాయకులు మారుతున్నారు తప్పా మా కష్టాలు మాత్రం తీరడం లేదు. నాయకులు, అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా కనీసం కన్నెత్తియినా చూడటం లేదని దేవబండ, ఎక్లాస్‌పురం, బింగుదొడ్డి గ్రామ ప్రజలు వాపోతున్నారు.

శంకుస్థాపనలకే పరిమితం..

ఎక్లాస్‌పురం, అయిజ, దేవబండ మధ్యనున్న పెద్ద వాగుపై బ్రిడ్జి నిర్మించాలని గత రెండు దశాబ్దాల క్రితం ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టలేదు. పెద్దవాగుపై బ్రిడ్జిని నిర్మించమని అటు అధికారులతో, ఇటు నాయకులతో ప్రజలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారి మొర అరణ్య రోదనలాగే మిగిలిపోయింది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవబండ గ్రామ ప్రజలు నిత్యం మండల కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి ఉంటుంది. దేవబండకు అయిజ మధ్యన ఉన్న పెద్దవాగుకు వంతెన లేకపోవడంతో వర్షాకాలం ఆయా గ్రామాల ప్రజలకు ఇతర గ్రామాలతో సంబంధాలు తెగిపోతాయి. వాగులో నీటి ప్రవాహం తగ్గేంత వరకు గ్రామంలోనే ఉండే పరిస్థితి. అత్యవసర సేవలు కూడా నిలిచిపోతున్నాయని పేర్కొన్నారు.

బుట్టదాఖలైన విన్నపాలు...

2003లో అప్పటి ఎమ్మెల్యే గట్టు భీముడు రూ.15 లక్షల అంచనాలతో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శిలాఫలకం వేసి 20 సంవత్సరాలు పూర్తయినా ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణం జరుగలేదు. 2005లో అప్పటి చిన్న పరిశ్రమల శాఖ మంత్రి డీకే అరుణతో మొరపెట్టుకున్నారు. అదే విధంగా 2011లో అప్పటి కలెక్టర్ పురుషోత్తమరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. 2012లో ఎమ్మెల్యే అబ్రహం ముందు వాపోయారు. 2013లో కూడా అప్పటి ఎంపీ మందజగన్నాథానికి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే విజయుడితో మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దేవబండ బ్రిడ్జి నిర్మాణ పనుల చేపట్టాలని వచ్చే వరదల నుంచైనా రక్షించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధికారులను వేడుకున్నాం..



దేవబండ బ్రిడ్జి నిర్మించాలని ఏళ్ల తరబడి అధికారులను వేడుకున్నా ఇంతవరకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేదు. తుఫాన్లు వచ్చే సమయంలో వాగులో వరద ఉధృతి కొన్ని రోజుల పాటు ఉంటుంది. దీంతో అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. అధికారులు వెంటనే బ్రిడ్జి నిర్మించి ప్రజల కష్టాలు తీర్చాలి.

– వెంకటేష్‌గౌడ్, దేవబండ

అవస్థలు పడుతున్నారు..



అయిజ రైతులతో పాటు ఎక్లాస్‌పురం గ్రామ రైతుల పంట పొలాలు కూడా దేవబండ గ్రామం సమీపంలో ఉన్నాయి. పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మించకపోవడంతో రైతులు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు. వాగులో వరద నీరు ప్రవహించినన్ని రోజులు రైతులు పొలం పనులను చేసుకోలేక పోతున్నారు.

– గోవిందు, ఎక్లాస్‌పురం

ప్రతిపాదనలు పంపాం..



దేవబండ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గతంలో అనేక మార్లు అధికారులు ప్రతిపాదనలు పంపాం. ఇంత వరకు నిధులు మంజూరు కాలేదు. ప్రజల కోరిక మేరకు మరలా నివేదికలు పంపుతాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తాం.

– ఆంజనేయుడు, పంచాయతీరాజ్ డీఈ

'ఎస్ఎస్ఏ' ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



సమ్మెలో పాల్గొన్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

గద్వాలటౌన్ : విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులను తక్షణం క్రమబద్ధీకరించాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలని, తమ ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక దీక్షలు కొనసాగుతున్నాయి. కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్లకార్డులు చేతబట్టి దీక్ష చేపట్టారు. సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు హుస్సేనప్ప, గోపాల్, జనార్ధన్, ఖాజా, సమి, శ్యామ్, శ్రీనివాసులు, శేషన్న, రామంజనేయులు, యువరాజు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

ఎర్రవల్లి: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన టైగర్ కుంగ్‌ఫూ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కరాటే మాస్టర్ విజయ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని కుంగ్ ఫూ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నాల్గవ జాతీయ స్థాయి కుంగ్ ఫూ, కరాటే పోటీల్లో ఎర్రవల్లికి చెందిన విద్యార్థులు నందిని, యక్షిత, జగదీష్, గోకుల్, కార్తిక్, రాహుల్, హేమంత్, వేణుతేజ, తబ్రేజ్, భరత్, జ్ఞానేశ్వర్, మీనాక్షి, దినేష్, ఓవైస్, వరుణ్‌తేజ ప్రతిభను కనబరచి బంగారు, వెండి పథకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించి మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

గద్వాల అర్బన్: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రం పాత బస్టాండులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అలూరు బిలకంటి రాము మాట్లాడుతూ.. ఆంధ్రరాష్ట్ర సాధన కోసం 56రోజుల పాటు అమరణ దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన మహనీయుడని కొనియాడారు. వారి త్యాగాన్ని ప్రతిరోజు మననం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

హృదయాన్ని శుద్ధి చేసుకోవడం ముఖ్యం



వేడుకల్లో మహిళలు

ధరూరు : క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలోని ఎంబీ షాలేము చర్చిలో స్త్రీల ప్రత్యేక ఆదివార ఆరాధన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టరమ్మ మరియమ్మ ప్రసాద్ సంఘ స్త్రీలనుద్దేశించి వాక్యోపదేశం చేశారు. హృదయాన్ని శుద్ధి చేసుకోవడం క్రిస్మస్ పండుగ ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో స్త్రీల సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మహబూబ్ ఉస్సేని దర్గా ఉర్సు



ఈర్లదిన్నెలోని మహబూబ్ ఉస్సేని దర్గా షరీఫ్

అమరచింత: మండలంలోని ఈర్లదిన్నె గ్రామంలో సోమవారం మహబూబ్ హుస్సేని దర్గా షరీఫ్ ఉర్సు నిర్వహిస్తున్నట్లు నిర్వహకుడు ఖతాల్ తెలిపారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ నెలలో మహబూబ్ ఉస్సేని ఉర్సోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అయన తెలిపారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు కలిసిమెలిసి దర్గా షరీఫ్‌లో ప్రార్థనలు చేసి కందూరు నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆనవాయితిగా పేర్కొన్నారు. ఆదివారం గంధోత్సవంతో ఉత్సవాలు ప్రారంభమైనట్లు తెలిపారు. సోమవారం ఉర్సును గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు



అలంపూర్ : జాతీయ రహదారిపై గుర్తు తెలియని కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న ఉత్తర ఫుడ్స్ కంపెనీ సమీపంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. కర్నూల్ జిల్లా వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన మహేష్ జీవనోపాధి కోసం బైక్‌పై పండ్లు పెట్టుకొని గ్రామాల్లో విక్రయిస్తుంటాడు. ఆదివారం బైక్‌పై ఆయా గ్రామాల్లో పండ్లు విక్రయించి తిరిగి ఇంటికి వెళ్తుండగా ఉత్తరఫుడ్స్ వద్ద గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ప్రమాదంలో మహేష్ తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రుడిని 108లో కర్నూల్‌కు తరలించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గద్వాల అర్బన్: విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా విద్యుత్ ఆర్టిజన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను సర్వీసు రూల్స్ ప్రకారం క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో టీవీఏసీజేఎసీ జిల్లా చైర్మన్ పరుమాల రాజు, జాయింట్ సెక్రటరీ మద్దిలేటి, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా నీరు.. పట్టని అధికారులు



మానవపాడు ఎస్సీ కాలనీలో వృథాగా పోతున్న నీరు

మానవపాడు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ అంబేడ్కర్ రోడ్డు పక్కనే ఉన్న కుళాయి ద్వారా నీరు వృథాగా పోతున్న పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఒకవైపు తాగునీటి ఇబ్బందులు ఉన్నా మరోవైపు నీరుగా వృథాగా పోతుందన్నారు. అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

బీఎస్పీ నేతల అరెస్టు అప్రజాస్వామికం



మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు

ఇటిక్యాల : న్యాయం కోసం వెళ్లిన బహుజన్ సమాజ్ పార్టీ నేతలను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఇంద్రకల్ గ్రామానికి చెందిన జ్యోతి వైద్యం వికటించి మృతి చెందడంతో కుటుంబ సభ్యులతో కలసి న్యాయ కోసం వెళ్లిన బీఎస్పీ నాయకులను ప్రభుత్వం పోలీసులతో అరెస్ట్ చేయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. శాంతియుతంగా న్యాయ కావాలని పోరాటం చేస్తున్న నాయకులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వ నియంతృత పోకడలు పరాకాష్టకు చేరుకున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు డేవిడ్, ఏసురాజు, రామకృష్ణ, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి అగ్ని ప్రమాదం.. తప్పిన ముప్పు



ముళ్లపొదల్లో ఎగిసిపడుతున్న మంటలు

అలంపూర్ : పట్టణంలోని కుమ్మరి వీధి పక్కన ఉన్న ముళ్ల పొదల్లో శనివారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. ముళ్లపొదల్లో మంటలు ఎగిసిపడటంతో కాలనీ వాసులు భయాందోళనకు గురయ్యారు. తక్షణమే పోలీసులకు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షిస్తుండగా అగ్నిమాపక వాహనం చేరుకుని మంటల ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. మంటల వ్యాపించిన పక్కన కుమ్మరి వీధికి చెందిన నివాస గృహాలు, గుడిసెలు ఉన్నాయి. దీంతో మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో స్థానిక అందోళన చెందారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సమయానికి రావడంతో పెను ప్రమాదం తప్పింది. కుమ్మరి వీధిలోకి అంబులెన్స్, అగ్నిమాపక వాహనం రావడానికి ఇబ్బంది కరంగా మారిందని ప్రజలు పేర్కొన్నారు. దారిని విస్తరించాలని కోరుతున్నారు.

నిర్మాణాత్మకమైన క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి



జిల్లా కేంద్రంలో విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాలటౌన్: క్రీడాకారులు నిర్మాణాత్మకమైన క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ పోటీల్లో సత్తా చాటాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గత వారం రోజులుగా అవుటర్ రింగ్ రోడ్డులోని మైదానంలో ఆదివారం బీబీఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. క్రీడల పట్టణంగా గద్వాల అభివృద్ధి చెందుతుందన్నారు. క్రీడలు జీవితానికి గొప్ప స్ఫూర్తినిస్తాయని, క్రీడలను తప్పనిసరిగా ప్రోత్సహించాలని సూచించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు నగదు ప్రోత్సహాక బహుమతులు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాబర్, నాయకులు గడ్డం కృష్ణరెడ్డి, బండారి బాస్కర్, వేణుగోపాల్, శ్రీకాంత్‌రెడ్డి, మురళి, దౌలు, నరహరి శ్రీను, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ఐడీఎస్ఎంటీ కాలనీ సంబంధించిన నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నర్సింహులు, గౌరవ అధ్యక్షుడిగా సుభాన్, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, హనుమంతు, చిలుకూరి ప్రభాకర్, ఖాజాపాష, నర్సింహ్మా, జాయింట్ సెక్రటరీలు చిరు, రంజిత్, దౌలన్న, సత్యం, పెద్ద రామన్న, సభ్యులుగా ఉదయ్, రఘు, శ్రీరాములు, ఉషాకుమార్, రవికిషోర్‌లతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని కాలనీ వాసులు పూలమాల, శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిని కలిసి సన్మానించారు. కాలనీ సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి

గద్వాల: ప్రభుత్వ సహకారంతో గద్వాలను మరింత అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని నూతనంగా నిర్మించిన బసన్న చౌరస్తాను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఎద్దులబండి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గద్వాల పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, మురళి, సాయిరాం, లక్ష్మీనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా ధన్వంతరి కల్యాణం



ఉత్తనూరులో రథాన్ని లాగుతున్న భక్తులు



కల్యాణంలో పాల్గొన్న దంపతులు

అయిజ : మండల పరిధిలోని ఉత్తనూరు గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా వెలసిన శ్రీ ధన్వంతరి వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. మార్గశిర పౌర్ణమి పర్వదినాన్ని పురష్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి కల్యాణాన్ని దంపతులు, బ్రాహ్మణులు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం అమ్మవార్లు, స్వామివారి ఉత్సవ విగ్రహాలకు రథోత్సవం నిర్వహించారు. పల్లకి సేవ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా భక్తులు కాయ చెక్కర సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ము లేస్తున్నా పట్టదా..?



దుమ్ము లేస్తున్న శాంతినగర్ - రాజోళి ప్రధాన రహదారి

శాంతినగర్ : వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో దుమ్ము లేస్తున్నా అధికారులకు, ప్రజాప్రతినిధులకు పట్టడం లేదని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాంతినగర్ నుంచి వడ్డేపల్లి రోడ్డుకు నెల రోజుల క్రితం కంకర, డస్ట్ వేసి వదిలేయడంతో దుమ్ము లేస్తోందని పేర్కొన్నారు. దుమ్ము, ధూళితో అనారోగ్యాల పాలవుతున్నామని, శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నట్లు పట్టణ వాసులు, జమ్ములమడుగు, ఇందిరా నగర్, రామచంద్రానగర్ వాసులు చెబుతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దుమ్ము లేస్తూ ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి త్వరతిగతిన బీటీ రోడ్డు వేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

భీమరాయుడి ధ్వజస్తంభం వద్ద పూజలు

అమరచింత: పట్టణంలోని రాంనగర్ కాలనీలో ప్రతిష్ఠించిన భీమరాయుడి ధ్వజస్తంభం వద్ద పౌర్ణమిని పురష్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ప్రతి సంవత్సరం భీమరాయుడికి పూజలు నిర్వహించి మొక్కులను చెల్లించుకోవడం అనాదిగా వస్తున్న అనవాయితి అని కాలనీ వాసులు మాజీ వార్డ్ మెంబర్ శ్రీనివాసులు తెలిపారు. పూజల అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.